సరికొత్తగా 'కొండవాలు'

- మెట్లమార్గాలకు మోక్షం
- అధ్వాన స్థితి నుంచి ఆధునికీకరణ వరకు
- మెట్లమార్గాలు–డ్రైనేజీల అభివృద్ధి

ఇది కదా అభివృద్ధి

47వ వార్డు కొండవాలులో మెట్లమార్గాలు రెయిలింగ్ పనులకు మంజూరైన నిధులు

వార్డులో ప్రాంతాలు	మెట్లమార్గాలు–డ్రైనేజీలకు
1. కప్పరాడ	రూ.09.5లక్షలు
2. రాంజీ ఎస్టేట్	రూ.15.3లక్షలు
3. అరుంధతినగర్	రూ.12.2లక్షలు
4. అల్లూరి సీతారామరాజుకాలనీ	రూ.02.55లక్షలు
5. అంబేద్కర్‌ఎస్టేట్	రూ.18.35లక్షలు
6.బాపూజీనగర్	రూ.21.8లక్షలు.
7.ఇందిరానగర్	రూ.13.5లక్షలు
8.తిక్కవానిపాలెం కాలనీ. 1,2	రూ.19.24లక్షలు
9.సురేష్‌రామ్‌నగర్	రూ.10.5లక్షలు


అందుబాటులోకి వచ్చిన కొత్త మెట్ల మార్గం


అరుంధతినగర్‌లో నాడు- నేడు మెట్ల మార్గాలు


బాపూజీనగర్‌లో నాడు-నేడు..


సురేష్‌రామ్‌నగర్‌లో కళకళలాడుతున్న మెట్ల మార్గం

కంచరపాలెం: జీవీఎంసీ 47వ వార్డు కంచరపాలెం, తాటిచెట్లపాలెం కొండవాలులో పలు ప్రాంతాల్లో మౌలిక వసతులు సమకూరాయి. ఎన్నాళ్ల నుంచో పడ్డ ఇబ్బందులు పూర్తిగా తొలగిపోయాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నేతలంతా మాటలకే పరిమితమయ్యారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొండవాలు ప్రాంతాలు రూపురేఖలు మారిపోయాయి. కొండవాలు ప్రాంతాల్లో మెట్ల మార్గాలు రాళ్లు తేలి శిథిలావస్థలో ఉండడంతో పాదచారులు నానా ఇబ్బందులు పడేవారు. నడక మార్గాలు అధ్వానంగా ఉండడంతో మౌలిక వసతులు కల్పించడానికి కష్టతరంగా ఉండేవి. ఎన్నో ఏళ్లగా వృద్ధులు, పిల్లలు, దివ్యాంగులు చాలా ఇబ్బందులు పడ్డారు. కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో అభివృద్ధి అంతంత మాత్రంగానే ఉండేది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎన్ని ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదు. అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజలు అడగకుండానే అభివృద్ధి చేసి చూపిస్తోంది. ఈ నాలుగున్నరేళ్లలో కప్పరాడ, రాంజీ ఎస్టేట్, బాపూజీనగర్, జవహర్‌లాల్‌నగర్, పెదకొత్తూరు, సూరిబాబునగర్, జైప్రకాష్‌నగర్, అల్లూరి సీతారామరాజుకాలనీ, ఇందిరానగర్, శివలింగపురం, అంబేద్కర్‌ఎస్టేట్, అరుంధతినగర్, సంజీవయ్యకాలనీ, సురేష్‌రామ్‌నగర్ ప్రాంతాల్లో సుమారు రూ1.89 కోట్లతో అభివృద్ధి పనులు పూర్తి చేశారు. కొండవాలు ప్రాంతాల్లో మెట్లమార్గాన్ని అభివృద్ధి చేశారు. వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు కంటిపాము కామేశ్వరి కౌన్సిల్‌లో నిధులు మంజూరు చేయించుకుని అభివృద్ధికి కృషికి చేశారు. 76 శాతం కొండవాలులో మెట్ల మార్గాలకు మోక్షం కల్గింది.

మెరుగ్గా మెట్ల మార్గాలు–డ్రైనేజీలు

వార్డు అంతా కొండవాలు ప్రాంతం కావడంతో మెట్ల మార్గాలు అధికంగా ఉన్నాయి. ఎన్నో ఏళ్లగా మెట్లమార్గాలకు మరమ్మతులు చేపట్టకపోవడంతో పాదచారులు నానా ఇబ్బందులు పడ్డారు. అభివృద్ధి జాడ కనిపించలేదు. నగర మేయర్ హరి వెంకట కుమారి, వార్డు కార్పొరేటర్ కామేశ్వరి కృషితో రక్షణ గోడలు, మెట్ల మార్గాలు, డ్రైనేజీలు, కాలువలు నిర్మాణం పూర్తయ్యాయి. మరికొన్న చోట్ల మరమ్మతు పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇప్పటికే సుమారు రూ.కోటీ 22 లక్షల 94 వేలు కొండవాలు ప్రాంతాల్లో మెట్ల మార్గాలు, రెయిలింగ్ పనులు పూర్తయ్యాయి. మరో రూ.35 లక్షల విలువగల పనులు కొనసాగుతున్నాయని జోన్-5 డీఈ భరణికుమార్ తెలిపారు.

పాదచారుల కష్టాలు తీరాయి



కొండవాలులో ఎన్నో ఏళ్లగా నివాసం ఉంటున్నాం. మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడ్డాం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక మా కష్టాలు తీరాయి. కొండవాలు ప్రాంతాల రూపురేఖలు మారిపోయాయి. జీవీఎంసీ నిధులు పుష్కలంగా మంజూరు కావడంతో అభివృద్ధి చురుగ్గా సాగుతోంది.

– సంతోష్, జైప్రకాష్‌నగర్

సదుపాయాల భేష్



కొండవాలు ప్రాంతాలను అభివృద్ధి చేయడం ఎంతో కష్టతరంతో కూడిన పని. అయితే ప్రస్తుత ప్రభుత్వం కొండవాలు ప్రాంతాల అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు విశేషంగా కృషి చేసింది. ఎక్కువ నిధులు మంజూరు కావడంతో మెట్ల మార్గాలకు మోక్షం లభించింది. శిథిలావస్థ నుంచి స్మార్ట్ వార్డ్‌గా మెట్ల మార్గాలు అభివృద్ధి చేస్తున్నారు.

–రాఘవులు, అరుంధతినగర్

అద్దంలా మెరుస్తున్నాయి



గతంలో మెట్ల మార్గాలు రాళ్లు తేలి శిథిలావస్థలో ఉండేవి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక అభివృద్ధి పనులపై దృష్టి పెట్టారు. ముందుకు మౌలిక వసతులు కల్పించారు. మెట్ల మార్గాలు అద్దంలా మెరుస్తున్నాయి. 2019 ఎన్నికలో జగన్ ఇచ్చిన హామీలు నేరువేరుస్తున్నారు.

–తేజేశ్వరరావు, బాపూజీనగర్

అభివృద్ధి చేసి చూపించారు



కొండవాలు ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గతంలో ఇంతలా అభివృద్ధి చేసిన దాఖలాలు లేవు. రాళ్లు తేలిన మెట్ల మార్గాలు, మౌలిక వసతులు లేని వైనంతో ఇబ్బంది పడ్డాం. ఇప్పుడా ఆ ఇబ్బందులన్నీ తొలగిపోయాయి.

–పి.సాయిబాబా, రాంజీ ఎస్టేట్

క్లుప్తంగా

గురుద్వార్‌ను సందర్శించిన కేంద్ర మంత్రి


మాట్లాడుతున్న కేంద్ర మంత్రి పురుషోత్తమ్ రూపాలా

సీతమ్మధార : కేంద్ర మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి పురుషోత్తమ్ రూపాలా గురుద్వార్ సత్‌సంగత్‌ను సందర్శించారు. వీర్ బాల్ దివస్ కార్యక్రమంలో పాల్గొన్నారు. చివరి సిక్కు గురువైన గురు గోవింద్ సింగ్ జీ నలుగురు కుమారుల ధైర్యసాహసాలకు నివాళులు అర్పించేందుకు డిసెంబర్ 26న వీర్ బల్ దివాస్ జరుపుకుంటారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గోవింద్ సింగ్ జీ నలుగురు కుమారుల ధైర్యసాహసాలు చరిత్రలో నిలిచిపోతాయన్నారు. కార్యక్రమంలో ఎంపీ జీవీఎల్ నరసింహరావు, గురుద్వార్ సత్‌సంగత్ అధ్యక్షుడు డా.డీఎస్.ఆనంద్, నగర బీజేపీ అధ్యక్షుడు మేడపాటి రవీంద్రరెడ్డి, మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల అందజేత


బాక్సింగ్ పోటీలను ప్రారంభిస్తున్న కేకే రాజు

తాటిచెట్లపాలెం: సింగమాంబ రాఖీ బాక్సింగ్ క్లబ్ వార్షికోత్సవం సందర్భంగా డీఎల్‌బీ గ్రౌండ్స్‌లో బాక్సింగ్ టోర్నమెంట్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు విచ్చేసి, ఆయన చేతుల మీదుగా విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఆళ్ల శివగణేష్, జేసీఎస్ మండల కన్వీనర్ వసంతల అప్పారావు, గురుపోజీ, శరత్‌కుమార్, కే చిన్నా, సంతోష్, కృపా, బాక్సింగ్ కోచ్ లక్ష్మణ్, అసిస్టెంట్ కోచ్ గోపి, ఉమెన్స్ కోచ్ ఎలమాజి, సెక్రటరీ సురేష్, ఇతర పెద్దలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఘనంగా దత్త జయంతి


పూజల్లో పాల్గొన్న భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు

సీతంపేట: శ్రీలలితాపీఠంలో మంగళవారం దత్తాత్రేయ స్వామి జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠంలో గల దత్తాత్రేయునికి విశేష క్షీరాభిషేకం, అర్చన జరిపారు. అనంతరం ప్రత్యేక అలంకరణ చేశారు. పలువురు భక్తులు పాల్గొని దత్తాత్రేయునికి అభిషేకం, పూజలు చేశారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

తాటిచెట్లపాలెం: రైల్వేన్యూకాలనీ, రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్ ఎదురుగా గల షిర్డీసాయిబాబా ధ్యాన మందిరంలో మంగళవారం దత్త జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి సాయిబాబాకు , దత్తాత్రేయకు విశేష అభిషేకాలు, పంచామృతాభిషేకాలు, 100కేజీల అన్నంతో అన్నాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుంకుమ, విభూది, గంధం, పవిత్ర నదీజలాలతో భక్తుల స్వహస్తాలతో అభిషేకం చేశారు. మధ్యాహ్నం హారతి అనంతరం మాలధారులకు ప్రత్యేక అన్నదానం కార్యక్రమాలను చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు, కమిటీ సభ్యులు, సాయి సేవకుల, మహిళలు పాల్గొన్నారు.

అల్పాహారం పంపిణీ

మురళీనగర్: జ్యోతిర్మయి సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. క్రిస్మస్ అనంతరం నిర్వహించే సేవా కార్యక్రమంలో భాగంగా సొసైటీ తరుపున ఎన్‌జీజీవోస్ కాలనీలో పెద్దలకు, పేద మహిళలకు అల్పాహారం పంపిణీ చేశారు. అడపా శ్రీకాంత్ ఇందుకు అవసరమైన ఆర్థిక సాయం అందించారు. సొసైటీ చైర్‌పర్సన్ లక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వాకర్ పి.అర్జునుడు, స్థానిక నాయకుడు ఆర్.పి.నాయుడు పాల్గొన్నారు.

అట్టహాసంగా క్రీడా సంబరం

- ఉత్తరంలో ప్రారంభమైన 'ఆడుదాం ఆంధ్రా'
- క్రీడాకారుల ప్రతిభ వెలికితీయడమే లక్ష్యం
- పోటీలను ప్రారంభించిన మేయర్ హరివెంకటకుమారి, ఉత్తర సమన్వయకర్త కేకే రాజు


క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కేకే రాజు, మేయర్ గొలగాని హరివెంకట కుమారి

తాటిచెట్లపాలెం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఆడుదాం ఆంధ్రా టోర్నమెంట్ విశాఖ ఉత్తర నియోజకవర్గ పరిధిలో కైలాసపురంలో గల డీఎల్‌బీ గ్రౌండ్స్‌లో మంగళవారం అట్టహాసంగా ప్రారంభమైంది. వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కేకే రాజు ఆధ్వర్యంలో మేయర్ గొలగాని హరివెంకటకుమారి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిభ గల క్రీడాకారులను వెలికితీసేందుకు, వారి ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి ఆడుదాం ఆంధ్రా టోర్నమెంట్‌కు రూపకల్పన చేశారన్నారు. ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఇటువంటి పోటీలు ఉపయోగపడతాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించిన ఈ పోటీలకు సుమారు 34 లక్షల మంది వివిధ క్రీడల కోసం రిజిస్ట్రేషన్లు చేయించుకోవడం ద్వారా ఈ పోటీలకు వచ్చిన స్పందన అర్థమవుతోందన్నారు. కార్యక్రమంలో మాజీ శాసన సభ్యులు తైనాల విజయకుమార్, ఎస్ఎ రెహమాన్, వీకేపీసీపీఐఆర్ చైర్‌పర్సన్ చొక్కాకుల లక్ష్మి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకులు బొడ్డేటి కాశీవిశ్వనాథ్, ఐ హెచ్ ఫరూఖి, పేడాడ రమణికుమారి, భరణికాన రామారావు, జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనోకు, స్టాండింగ్ కమిటీ సభ్యులు, కార్పొరేటర్లు చల్లా రజిని, కంటిపాము కామేశ్వరి, కె.అనిల్‌కుమార్ రాజు, సాడి పద్మారెడ్డి, ఆళ్ల లీలావతి, పి.ఉషశ్రీ, వావిలపల్లి ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, బర్కత్ అలీ, కో ఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కిరణ్‌రాజు, జిల్లా యువజన విభాగం అధ్యక్షులు ఆళ్ల శివగణేష్, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ కేవీ బాబా, మండల అధ్యక్షులు జీవీ రమణి, కృష్ణారావు మాస్టర్, వార్డు అధ్యక్షుడు పైడి రమణ, నీలిరవి, పీలా వెంకటలక్ష్మి, షేక్ జుబేర్, కేపీ రత్నాకర్, డైరెక్టర్లు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, సభ్యులు, సచివాలయ కన్వీనర్లు, కార్యకర్తలు, క్రీడాకారులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

అదిరిన ఆహ్వాన్ ఫెస్ట్

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు


నృత్యం చేస్తున్న విద్యార్థులు


సందడి చేసిన సినీ నటి అవికాగోర్

డాబాగార్డెన్స్: విద్యార్థుల కేరింతలతో ఏవీఎన్ కళాశాల ప్రాంగణం దద్దరిల్లింది. కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న 'ఆహ్వాన్ ఫెస్ట్' మంగళవారం ప్రారంభమైంది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పలు కార్యక్రమాలు నిర్వహించగా.. మధ్యాహ్నం నుంచి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సినీతార అవికాగోర్, నటులు బుల్లెట్ భాస్కర్, ఐనవోలు ప్రసన్నకుమార్ పాల్గొని విద్యార్థులను ఉత్సాహపరిచారు. చదువుకుంటేనే భవిష్యత్ అంటూ హితవు పలికారు. ఫెస్ట్‌లో భాగంగా డ్యాన్స్, మ్యాజిక్, సింగింగ్, స్కిట్, స్టాండప్ కామెడీ, డైలాగ్ వార్స్, ర్యాంప్ వాక్‌తో విద్యార్థులు అదరగొట్టారు. అలాగే విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ఏవీ అదీప్ భానోజీరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత వెలికితీసేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. కళాశాలలో చదువుకున్న ఎంతో మంది విద్యార్థులు ప్రపంచ స్థాయిలో పేరు ప్రఖ్యాతలు అందుకున్నారని.. అందుకు ఎంతో గర్విస్తున్నానన్నారు. వారందరి స్ఫూర్తితో విద్యార్థులు మరింతగా చదివి ఇటు కళాశాలకు..అటు తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని పిలుపునిచ్చారు. కళాశాల ప్రిన్సిపాల్ మొజ్జాడ సింహాద్రినాయుడు మాట్లాడుతూ నగరంలోని వివిధ కళాశాలల విద్యార్థులు ఫెస్ట్‌లో పాల్గొన్నారని చెప్పారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, డీన్ డాక్టర్ జి శంకరనారాయణ, మీడియా కో ఆర్డినేటర్ పైడి రజని తదితరులు పాల్గొన్నారు.

29న జూనియర్ చాంబర్ ఆఫ్ కామర్స్ వార్షిక సంబరాలు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న జేకాం ప్రతినిధులు

సీతంపేట: జూనియర్ చాంబర్ ఆఫ్ కామర్స్ (జేకాం) వార్షిక సంబరాలను ఈ నెల 29న సాగర్‌నగర్‌లోని ఆరిఫ్ సీసైడ్ రిసార్ట్స్‌లో ఘనంగా నిర్వహించనున్నట్టు 2.0 టేబుల్ కోచ్ ఎస్.రాజశేఖర్ తెలిపారు. శాంతిపురంలోని హౌస్‌లో మంగళవారం పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏన్యువల్ డిలైట్ పేరుతో జరిగే ఈ సంబరాలు దేశంలో అతిపెద్ద ఈవెంట్‌గా నిలుస్తుందన్నారు. ఈ గ్రూప్‌లో సభ్యులుగా ఉన్న వివిధ రంగాలకు చెందిన వ్యాపార, వాణిజ్య వేత్తలు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. జేకామ్ చైర్మన్ బి.చైతన్యరాజీవ్ మాట్లాడుతూ ఈఏడాది జేకాం విశాఖ 2.0 గ్రూపు లక్ష్యం అధిగమించి పురోగతి సాధించిందన్నారు. గ్రూప్ సాధించిన ఘన విజయాల నివేదిక ఆరోజు సమర్పిస్తామన్నారు. 2.0 టేబుల్ అభివృద్ధికి పాటుపడిన సభ్యులకు అవార్డులు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ పి.అశోక్‌కుమార్, కార్యదర్శి ఎస్.నవ్య, కోశాధికారి ఎం.హేమంత్ కుమార్, డైరెక్టర్ కె.ఎం. కె.రమేష్, సూర్యతేజ, శివగుప్తా, సంతోషి, అనూష, మీనా రమణి, రుషి పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి పూజలు

సీతమ్మధార : జీవీఎంసీ పరిధి 14 వార్డులోని శ్రీమహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర స్వామి, అయ్యప్ప, షిర్డీ సాయి బాబా ఆలయంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి పూజలు అత్యంత భక్తి శ్రద్ధలతో చేశారు. అర్చకుడు రాజాస్వామి ఆధ్వర్యంలో ఉదయం గణపతి పూజ, జలాభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజా స్వామి మాట్లాడుతూ సుబ్రహ్మణ్యస్వామి ఆరాధన వల్ల నేత్రరోగాలు, చర్మవ్యాధులు తగ్గుతాయన్నారు.

అంజనీ పుత్రుడికి ..

మర్రిపాలెం: జీవీఎంసీ 53వ వార్డు హైవే దరి సాయినగర్‌లో వున్న ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ మేరకు మంగళవారం స్వామి వారికి అర్చకుడు వరాహగిరి స్వామి వారికి ప్రీతిపాత్రమైన ఆకుపూజ,సహస్రతమల అర్చన,పుష్ప అలంకరణ పూజలు చేశారు.పెద్ద ఎత్తున భక్తులు అంజనేయ స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అలరించిన ఘంటసాల ఆరాధన

సీతంపేట: టెలిగ్రామ్ గ్రూప్ ఆధ్వర్యంలో స్థానిక పౌర గ్రంథాలయంలో ఘంటసాల ఆరాధన ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన లఘునాటికలు, అవధాన కార్యక్రమాలు అలరించాయి. డాక్టర్ రహమతుల్లా ఘంటసాలపై చేసిన గానావధానం ప్రేక్షకులను ఆకట్టుకుంది. వేదికపై పురుషులు, మహిళలు ఘంటసాల పాటలతో ఆడిన కబడ్డీ వినోదాన్ని పంచింది. ఈ సందర్భంగా కార్డియాలజిస్ట్ డాక్టర్ మహేష్‌బాబును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నందగోపాల్, సత్యవాణి, ఎం.ఎస్.వి.సుబ్బారావు, కె.రామ్మూర్తి, బి.కల్యాణి, ఆకుల శ్రీనివాస్, మస్తాన్‌రెడ్డి పాల్గొన్నారు.

'సాహిత్యం సామాజిక ప్రయోజనం'పై స్మారకోపన్యాసం

సీతంపేట: విశ్వ సాహిత్య లలిత కళావేదిక ఆధ్వర్యంలో బహుముఖ ప్రజ్ఞానిధి గణపతిరాజు ఈశ్వర వర్మ స్మారక సాహిత్య కార్యక్రమంలో స్థానిక పౌరగ్రంథాలయంలో మంగళవారం జరిగింది. డాక్టర్ డి.వి.సూర్యారావు అధ్యక్షతన జరిగిన సభలో పద్మశ్రీ డాక్టర్ కూటికుప్పల సూర్యారావు 'సాహిత్యం, సామాజిక ప్రయోజనం' అంశంపై స్మారకోపన్యాసం చేసారు. ముందుగా గణపతిరాజు చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆచార్య జి.ఎస్.ఎన్.రాజు, టీపీఎన్ ఆచార్యులు, దామరాజు విశాలాక్షి, కళావేదిక కార్యదర్శి బుక్కూరు వెంకటరావు, సహ కార్యదర్శి రఘువీర్ పాల్గొన్నారు.

మహిళలకు దుప్పట్ల పంపిణీ


వేంకటేశ్వరకాలనీలో దుప్పట్లు, పండ్లు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ ఉషశ్రీ

సీతంపేట: జీవీఎంసీ 43వ వార్డు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ జన్మదిన వేడుకలు మంగళవారం నందగిరినగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. పార్టీ ముఖ్య నాయకులు, స్థానిక నాయకులు, కార్యకర్తల మధ్య కేక్ కట్ చేశారు. అనంతరం ఉషశ్రీ యూత్ ఫోర్స్ నిర్వహించిన పలు సేవా కార్యక్రమాలలో ఆమె పాల్గొన్నారు. వేంకటేశ్వరకాలనీలో మహిళలకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. జగన్నాథపురంలోని ప్రియదర్శిని వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. అలాగే పుట్ట బంగారమ్మ గుడి వద్ద భక్తులకు, శంకరమఠంలో అయ్యప్ప దీక్షా స్వాములకు అన్నప్రసాద వితరణలో పాల్గొని వడ్డన చేశారు. ఈ కార్యక్రమంలో భైర వెంకట్, వల్లి, శ్యాం, పవన్, ప్రశాంత్, హరీష్, గౌతం తదితరులు పాల్గొన్నారు.